ప్రజాశక్తి
ఆదివారం 17 నవంబర్ 2024
I
అల్లూరి సీతారామరాజు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - చింతపల్లి : యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జే కూర్మారావు కోరారు. మండలంలోని పెంటపాడు ప్రాంతీయ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటిఐ) కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశీయ మద్యం (నాటు సారా) సేవనం, వినియోగం, విక్రయం, యువతపై డ్రగ్స్ ప్రభావం, అనధికార ఎన్‌డిపిఎల్,, ఐఎంఎల్ మద్యం, ఎండు గంజాయి తదితరాల నిర్మూలనకు సహకరించాలన్నారు. విద్యార్థులు సన్మార్గంలో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఎస్సై పి.అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ కే చిన్నయ్య, ఆర్‌డి నాయుడు, శివ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో పలుచోట్ల ర్యాలీలు, ధర్నాలు

పాడేరు ఐటిడిఎ వద్ద ధర్నా చేపట్టిన అంగన్‌వాడీలు, సిఐటియు నేతలు

ప్రజాశక్తి-పాడేరు : మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మారుస్తూ జీ.వో ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రం పాడేరు లో అంగన్వాడీ వర్కర్లు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఐటిడిఎ వద్ద నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ, అనంతరం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగనవాడి, వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి. నాగమ్మ, వి.భాగ్యలక్ష్మి, సిఐటియు నేత ఎల్.సుందరరావు మాట్లాడుతూ, మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో వెంటనే విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా జిల్లా కేంద్రం వద్ద ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. అంగన్వాడీలకు గత ఎన్నికల్లో ఇచ్చినటువంటి వాగ్దానం వెంటనే అమలు చేయాలని, పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడి మినీ వర్కర్స్ అనేక సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అంగన్వాడి సెంటర్స్ నిర్వహణకు వర్కర్ పని, హెల్పర్ పని చేయడం వలన పని భారం పెరిగిందని, మినీ వర్కర్స్ లకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని, మినీ వర్గాలకు సమాన వేతనం ఇవ్వాలని, నాణ్యమైనటువంటి సెల్ ఫోన్లు ఇవ్వాలని అన్ని అప్స్ కలిపి ఒకే యాప్ గా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి 11 మండలాల ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధి నుంచి అంగన్వాడి వర్కర్స్ సంఘ నాయకులు ఇంద్ర, పెంటమ్మ, అప్పలకొండ, రాములమ్మ, అప్పల నర్స, కొండమ్మ, నిర్మల, సుజాత, అంగనవాడి కార్మికులు పాల్గొన్నారు.

రంపచోడవరం:మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వాటిల్లో పని చేసే వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం నుండి రంపచోడవరం ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ఐటిడిఎ ఎదుట బైఠాయించారు. తమ డిమాండ్లపై సుమారు మూడు గంటల పాటు ధర్నా చేపట్టారు. అయినా ఐటిడిఎ పిఒ స్పందించకపోవడంతో మినీ అంగన్వాడీలు ఐటిడిఎ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో అంగన్వాడీలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు, ఐటిడిఎ పిఒకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం బయటకు వచ్చి ఆందోళనకారుల నుండి వినతిపత్రం స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి మాట్లాడుతూ ఒక అంగన్వాడీ సెంటర్‌లో వర్కర్, హెల్పర్ పనులు రెండింటిని ఒక్కరే నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోగా, ఎక్కువ పనిభారం మోపుతున్నారన్నారు. గతంలో చంద్రబాబు అంగన్వాడీలను గుర్రాలతో తొక్కించి తొమ్మిదేళ్ళ అధికారం కోల్పోయారని, మరోసారి ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల, వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, కె.శాంతిరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నిర్మల, జిల్లా,నాయకులు, కారం రామలక్ష్మి, కె.రాణి, సింగరమ్మ, కె.వెంకటలక్ష్మి. జీ,బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

రంప చోడవరంలో మాట్లాడుతున్న బేబీరాణి

చింతూరులో ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీలు

చింతూరు : మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మార్చాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం చింతూరు బస్ స్టాండ్ నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వచించి, అక్కడ ధర్నా చేపట్టారు. ఇందులో పాల్గొన్న సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, ఉపాధ్యక్షులు కొమరం పెంటయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు చింతూరు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, నాయకులు కారం సుబ్బారావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.రాజేశ్వరి, నాలుగు మండలాల ప్రాజెక్టు లీడర్లు నూక రత్నం, సున్నం రంగమ్మ, అన్నపూర్ణ, బాబు, ముత్తమ్మ, కనకదుర్గ, వసంత, పార్వతి, చుక్కమ్మ, అర్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో కమ్మేసిన మంచు

సీలేరులో పెరుగుతున్న చలి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలో శనివారం మంచు అధికంగా కురిసింది. పగటిపూట మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే స్వల్ప చిరుగాలులతో చలి ప్రారంభమైంది. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురవడంతో రానురాను మంచు, చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని అక్కడ ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికే తెల్లవారుజామున వాకింగ్‌కి వెళ్లేవారు చలి కారణంగా కాస్త ఇబ్బందులు గురవుతున్నారు. స్థానిక రెగ్యులేటరీ మెయిన్ డ్యాం పరిసర ప్రాంతాల్లో అధికంగా మంచు కురవడంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చే వాహనదారులు తెల్లవారుజామున హెడ్ లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తోంది.

18న క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు బిర్సా ముండా జయంత్యోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించే వివిధ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 18న సోమవారం రంపచోడవరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం నియోజకవర్గం స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కంగల పోతురాజు వెల్లడించారు. విలువిద్య, జావిలన్ త్రో, వాలీబాల్ ఎంపిక పోటీలు ఆ రోజు ఉదయం 8 గంటల నుండి జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 22 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. అనంతరం వీరు ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

సిపిఎంతోనే గిరిజన చట్టాలు, హక్కుల రక్షణ

పార్టీ రాష్ట కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర

మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి -అనంతగిరి:గిరిజన చట్టాలు, హక్కుల రక్షణ సీపీఎంతోనే సాధ్యం పడుతుందని, నాన్ షెడ్యూల్ ప్రాంతాన్ని షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో. సురేంద్ర, అల్లరి జిల్లా కార్యదర్శి అప్పననర్స లు తెలిపారు.స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం సిపిఎం మండల మహా సభ నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అరుకు, పాడేరు గిరిజన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్ళి గిరిజన సమస్యలపై మాట్లడక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ అసెంబ్లీకి వెళ్లవద్దుంటే వెళ్లకుండా మౌనంగా ఉంటే గిరిజన సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. గిరిజనుల పక్షాన పోరాడేది సీపీఎం అని ఉద్ఘాటించారు. మిగిలిన పార్టీలు నరేంద్ర మోడీకి భయపడి ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాయని విమర్శించారు. అదాని కంపెనీ కి మేలు చేయడం కోసం స్మార్ట్ మీటర్లు వేస్తున్నారని, భవిష్యత్తులో ఫోన్ మాదిరిగా కరెంటుకి కూడా రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

జడ్పీటీసీ సభ్యులు దీసరి. గంగరాజు మాట్లాడుతూ మన జిల్లాకు కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండి కూడా కనీసం మాట్లాడ లేదని విమర్శించారు. జిల్లా పరిషత్‌లో పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సోమెల నాగులు, దేవన్న, కొండలరావు, దేముడమ్మ, వెంకటరమణ, బుద్రయ్య, గంగులు కాసులమ్మ, భీమరాజు తదితరులు పాల్గొన్నారు

మండల కార్యదర్శిగా మొస్య

సిపిఎం మండల కార్యదర్శిగా కిలో మొస్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గిరిజన సంఘం కార్యాలయం వద్ద సిపిఎం 8వ మహాసభ నిర్వహించారు. 11 మంది కమిటీ సభ్యులతో మండల కార్యదర్శి ఏకగ్రీవ ఎన్నిక జరిగింది.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయ భారతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ, ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 55 శాతంతో పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. నెట్, స్లెట్, పిహెచ్‌డిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో 19 తేదీన (మంగళవారం) కళాశాలలో సంప్రదించాలని, డెమో, ఇంటర్వ్యూ ఆధారముగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

రామ్మూర్తి నాయుడు మృతిపై కిడారి సంతాపం

ప్రజాశక్తి -పాడేరు : కుప్పం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు గుండె పోటుతో మరణించడం పట్ల రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రామ్మూర్తి నాయుడు మరణం తెలుగుదేశం పార్టీకి నారా కుటుంబానికి తీరని లోటని, ఆయన మరణం బాధాకరమన్నారు. కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న జమాల్ ఖాన్

కోటిరెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని కల్తునూరు గ్రామానికి చెందిన కెచ్చల కోటిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ రూ.5వేలు ఆర్థిక సాయం శనివారం అందించారు. కోటిరెడ్డి మృతి చెందిన విషయం సర్పంచ్ పులి సంతోష్ కుమార్, మండల నాయకులు జమల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందించి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు తరుపున జమాల్ ఖాన్ శనివారం బాధిత కుటుంబ సభ్యులకు శ్రీరామగిరి మాజీ సర్పంచ్ సోడి బుబమ్మ, నాయకులు సమక్షంలో అందజేశారు. అలాగే రామవరంలో రూ.60వేలు విలువైన వ్యవసాయ బోరు మెయిన్ పరికరం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సోడి మల్లయ్య, కమ్మచిచ్చు సత్యనారయణ, శ్రీరామగిరి శాఖ కార్యదర్శి కాంతారావు, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, ఎస్‌డి.సరపరాజ్, సిపిఎం సీనియర్ నాయకులు వీర్ల నాగేశ్వరరావు, ప్రముఖులు ముత్యాల మల్లికార్జునరావు, జెకెసి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న రజని

మెరకచింత డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్

-ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీస్

- గిరిజన సంక్షేమశాఖ ఇంచార్జ్ ఉప సంచాలకులు రజని

ప్రజాశక్తి-హుకుంపేట:మండలం లోని మెరకచింత ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ ఎం.పి కోటేశ్వర రావును సస్పెండ్ చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ ఉప సంచాలకులు ఎల్. రజని ఉత్తర్వులు జారీ చేసారు. అదేవిధంగా అదే పాఠశాలలో ప్రదానోపాధ్యయురాలుగా పని చేస్తున్న ఎస్. శాంత కుమారికి షోకాజ్ నోటీస్ జారీ చేసారు. వివరాలలోకి వెళ్తే... 15వ తేదీ అర్ధ రాత్రి పాఠశాలకు చెందిన 20 బస్తాల బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా బాకూరు గ్రామస్తులు పట్టుకుని సీజ్ చేయడం జరిగింది. శనివారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న ఇంచార్జ్ ఉప సంచాలకులు నేరుగా వెళ్లి విచారణ జరపగా ఆ బియ్యం మెరకచింత పాఠశాలకు చెందినవిగా గుర్తించి ప్రాథమిక విచారాణ ప్రకారం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సూచనల మేరకు డిప్యూటీ వార్డెన్ ను సస్పెండ్ చేయడంతో పాటు హెచ్‌ఎం ను సంజాయషీ కోరినట్లు ఎల్, రజని తెలిపారు. ఆపై పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న నీలకంఠం ను వార్డెన్ గా అపాయింట్ చేశారు. పాఠశాలలకు సంబంధించిన రేషన్ సరుకులు అక్రమ రవాణా చేపడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మెనూలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, మాజీ సర్పంచ్ ,సీపీఎం మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణ్ రావు, మాజీ ఎంపీటీసీ నైని కొండలరావు, బాకూరు దేవి రాజు,వైస్ సర్పంచ్ నైని బొంజుబాబు,, టీడీపీ బాకూరు పంచాయితీ నాయకులు బాకూరు చంద్ర మోహన్ రాజు పాల్గొన్నారు.

గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్ల నిరాహార దీక్ష

ప్రజాశక్తి -పాడేరు: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ టీచర్లు తమ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. పాడేరు డివిజన్లోని వివిధ మండలాల స్కూల్స్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ టీచర్లు నిరాహార దీక్షకు తరలివచ్చారు. ఈ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేపట్టిన ఈ నిరాహార దీక్షను ఉద్దేశించి అల్లూరి జిల్లా సంఘ అధ్యక్షులు ఎల్ కొండబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం విడుదల చేసిన 2024 మెగా డీఎస్సీలో గిరిజన గురుకులంలోని 1143 పోస్టులను డీఎస్సీలో చూపరాదని డిమాండ్ చేశారు. తమ ఔట్సోర్సింగ్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తమను కాంట్రాక్టు టీచర్లుగా గుర్తించాలని, 2022 పి ఆర్ సి ప్రకారం గిరిజన గురుకులాల్లోని ఔట్సోర్సింగ్ టీచర్లకు వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 191 గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 1633 మంది అవుట్సోర్సింగ్ టీచర్లకు న్యాయం చేయాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ టీచర్ల సంఘం అల్లూరి జిల్లా నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు ఐ.శేఖర్, రామకృష్ణ, ఎం లక్ష్మణ్, పి రత్నకుమార్, కే మోహన్ రావు, నాగరాజు మహిళా టీచర్లు పాల్గొన్నారు.

దీక్ష చేపడుతున్న టీచర్లు

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-దేవీపట్నం

పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన నిర్వాసితులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల 371 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, అందులో ఇప్పటి వరకు 65 గ్రామాలకు చెందిన వారికే ఇళ్లు నిర్మించారని, ఇంకా 306 గ్రామాల ప్రజలకు ఇళ్లు నిర్మించాల్సి ఉందని పేర్కొన్నారు. దేవీపట్నం మండలం దేవీపట్నం, పూడిపల్లి గ్రామాల గిరిజనేతరలకు ఇళ్లు నిర్మించకుండా వారికి ముంపునకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు గోకవరం సమీపంలో నిర్మిస్తున్న ఇళ్లు ఇంకా పూర్తి చేయలేదన్నారు. కొంత మంది గిరిజనులకు భూమికి భూమి ఇవ్వడం లేదని, కొంత మందికి ఇచ్చిన భూములు వ్యవసాయానికి ఉపయోగపడేలా లేవని పేర్కొన్నారు. గతంలో గంగవరం మండలంలో గిరిజనేతరుల వద్ద కొంత భూమి రెవిన్యూ అధికారులు సేకరించారని, అందులో కొంత భూమిని గిరిజనులకు ఇవ్వగా మిగతా భూమి పంపిణీ జరగలేదని తెలిపారు. గంగవరం, అడ్డతీగల, రంపచోడవరం, దేవిపట్నం మండలాల్లో కొండలు, వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో చెట్టులు నరికి సుమారు 2 కొట్లు వృధా చేశారన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి గిరిజన నిర్వాసితులకు రూ.6.30 లక్షలు, గిరిజనేతరులకు రూ.6.80 లక్షలు ఇస్తున్నారని, ఆ నష్టపరిహారం పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల నూతన కమిటీ ఎన్నిక శనివారం స్థానిక మండల పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగిన యుటిఎఫ్ మండల సమావేశంలో జరిగింది. యుటిఎఫ్ మండల నూతన గౌరవాధ్యక్షులుగా కె.ఆంధ్రయ్య, అధ్యక్షులుగా డి.మహేష్, సహాధ్యక్షులుగా ఎం.సాయిబాబా, ఎల్.దయామణి, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణారెడ్డి, కోశాధికారిగా కె.పండయ్య, కార్యదర్శులుగా వి అబ్బాస్, సిహెచ్.సూర్యనారాయణ రెడ్డి, వై.దుర్గా వెంకటరెడ్డి, వి రాజారెడ్డి, పి.సిరిశేషకుమారి, మండల ఆడిటర్‌గా ఎం.జగ్జీవన్, కుటుంబ సంక్షేమ బాధ్యులుగా జి.త్రినాధ్, పత్రిక కార్యదర్శిగా డి.చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి.విశ్వరాజు వ్యవహరించారు. పరిశీలకులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై విల్సన్ బాబు, ముఖ్య అతిథులుగా రంపచోడవరం అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు సిహెచ్.సనాతనబాబు, ఎన్ వెంగళరావు, దేవీపట్నం మండల ప్రధాన కార్యదర్శి చిన్నిబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ మండల కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

అంతర్గత రోడ్లు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని గుండాల, రాయనపేట గ్రామ పంచాయతీల పరిధిలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేయాలని కోరుతూ ఆయా సచివాలయాల అధికారులకు, ఎటపాక ఎంపిడిఓ కార్యాలయ అధికారులకు సిపిఎం నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ గుండాలలోని హైవే దగ్గరున్న బస్‌స్టాప్ నుండి గుండాల కాలనీ మీదుగా ఎర్రబోరు వరకు, రాయనపేట పంచాయతీ పరిధిలోని కెఎన్.పురం ఆశ్రమ హైస్కూల్ నుండి సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్ వరకు తారు రోడ్లు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. త్వరగా రోడ్లు నిర్మించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇరపా సత్యం, నూతలపాటి సుధాకర్‌రావు, పసుపులేటి ప్రవీణ్, గుండాల, రాయనపేట పంచాయతీల నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు ఐవి తదితరులు

భూమి పూజ చేస్తున్న టిడిపి నేత ఎంవివి.ప్రసాద్

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రేవళ్ళు పంచాయితీ కంఠారం గ్రామంలో రూ.4లక్షలతో 105 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవివి.ప్రసాద్ శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీలో సంక్షేమం, అభివృద్ధి టిడిపి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో రేవళ్ళు సర్పంచ్ జనుమూరి వెంకటలక్ష్మి, కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, టిడిపి నాయకులు అప్పలరాజు, అప్పారావు, బిజెపి నాయకులు మేడిపోయిన చిన్న పాల్గొన్నారు.

వేకవారిగూడెం వరకు రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని బురదగూడెం నుండి వేకవారి గూడెం వరకు రహదారి నిర్మించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం లింగాపురం శాఖ మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ వరదలు వచ్చినపుడు ప్రత్యామ్నాయం రహదారి లేదని, ఈ రహదారి ఏర్పాటు చేస్తే ఆయా గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. సర్వే చేసిన గ్రామాలకు తక్షణమే ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. సిపిఎం శాఖ కార్యదర్శి సోడే రత్తయ్య, స్థానిక సర్పంచ్ శంకర్, మాజీ సర్పంచ్ సోడే రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా రామలక్ష్మి నియామకంపై హర్షం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా మాజీ జెడ్‌పిటిసి పల్లాల రామలక్ష్మిని నియమించడం పట్ల కాంగ్రెస్ నాయకులు నక్కబాల శివరామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రామలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేస్తామని మాజీ ఎంపిటీసీలు నక్కబాల శివరామకృష్ణ, చిలకకాల సత్యనారాయణ, కార్యకర్తలు చుక్క సంతోష్ కుమార్, బచ్చేల ఆదినారాయణ, రాయుడు బాబు నల్లమిల్లి సుందర్ బాబు తెలిపారు.

నీతి, నిజాయితీతోనే న్యాయవాద వృత్తిలో రాణింపు

ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

మాట్లాడుతున్న జస్టిస్ రవి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : న్యాయశాస్త్రం నిర్దేశించిన నైతికత, నీతి, నిజాయితీ, విలువలే పెట్టుబడిగా న్యాయవాద వృత్తిలో జూనియర్లు రాణించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. శనివారం న్యాయవాదుల గ్రంథాలయంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ నిర్వహించిన డాక్టర్ పద్మనాభరెడ్డి స్మారకోపన్యాసంలో మాట్లాడుతూ, నేటి తరం న్యాయవాదులకు పద్మనాభరెడ్డి వృత్తిపట్ల నిబద్ధత ఆదర్శనీయమన్నారు.

ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో రోజుకు 50 పైచిలుకు కేసులు ఉన్నప్పటికీ, ప్రతి కేసులోనూ స్వయంగా తానే హాజరై కక్షిదారులకు న్యాయమంది ంచేందుకు పద్మనాభరెడ్డి సర్వశక్తులు ఒడ్డి, కృషి చేసేవారన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని జస్టిస్ రవి గుర్తు చేసుకున్నారు. నేటి కొత్త తరం న్యాయ వాదులకు సబ్జెక్టు పరంగా పూర్తి పరిపక్వతతో వాదనలు వినిపిస్తున్నప్పటికీ, నైతిక విలువల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు.

కోర్టు హాలులో క్రమశిక్షణ, సీనియర్స్‌కు గౌరవం ఇచ్చిపుచ్చుకోవడం నేటితరం న్యాయవాదులు నేర్చుకోవాలన్నారు. సమాజాభివృద్ధిలో న్యాయవాదుల పాత్రను వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అఖిలభారత న్యాయవాదుల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెఎస్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నో కేసులతో ఒత్తిడిలో ఉన్నప్పటికీ, పద్మనాభరెడ్డి జూనియర్ లాయర్ల పట్ల వాత్సల్య భావనతో ఉండి, మెళకువలను నేర్పేవారన్నారు. నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ, నీతికి నిజాయితీకి వృత్తిలో నైతికతకు పద్మనాభరెడ్డి నిదర్శనమన్నారు. ఎపి హైకోర్టు బార్ కౌన్సిల్ పూర్వ ఉపాధ్యక్షులు రామ జోగేశ్వరరావు మాట్లాడుతూ జస్టిస్ విఆర్ కృష్ణయ్య భావాలను పుణికిపుచ్చుకొని పద్మనాభ రెడ్డి న్యాయవాదవృత్తిని కొనసాగించారన్నారు. ఐఎఎల్ జనరల్ సెక్రెటరీ అజయ్ కుమార్ జహారా, కార్యక్రమ ఆర్గనైజర్ భగవతి, యూనియన్ ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, పి నర్సింగరావు, డి రమేష్, చింతపల్లి రాంబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో తప్పని అవస్థలు

దారిలేక ఆగిన 108 అంబులెన్స్

ప్రజాశక్తి -హుకుంపేట:-మండల కేంద్రంలోని నిత్యం ట్రాఫిక్ బెడదతో ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అంబులెన్స్ కూడా దారి దొరకని పరిస్థితి ఏర్పడింది. శనివారం వారపు సంత కావడంతో ట్రాఫిక్‌లో వాహనాలు నిలిచి పోయాయి. రోడ్డు విస్తీర్ణం లేక ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హుకుంపేట మెయిన్ రోడ్‌లో నిత్యం ట్రాఫిక్ తో అవస్థలు పడాల్సి వస్తుంది.రోడ్డు పక్కన ఉన్న ఆర్ ఎం బి స్థలాలు సైతం అక్రమంగా దుకాణాలు నిర్మాణం చేపడుతున్నా రెవెన్యూ అధికారులు వాటిని తొలగించకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

దంపతులపై కత్తితో దాడి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తాడి పుట్టు పంచాయితీ గడుగుపల్లి గ్రామంలో శనివారం భార్యాభర్తలపై దాడి చేసిన సంఘటన తీవ్ర సంచలనం రేపింది. దీనికి సంబంధించిన వివరాలు.. కోడా రత్నాలమ్మ, కృష్ణ బాబు దంపతులు తమ వరి పొలం పనులు ము గించుకుని వస్తున్న సమయంలో పశువుల కోసం ఉంచిన గడ్డిని అదే గ్రామానికి చెందిన తమర్బ చినకొండ పడాల్ కాల్చి బూడిద చేసాడు. తమ పశువుల కోసం ఉంచిన గడ్డిని ఎందుకు దహనం చేశావని రత్నాలమ్మ, ఆమె భర్త కృష్ణ బాబు అతడిని నిలదీశారు. మద్యం మత్తులో ఉన్న ఆయన కోపోద్రుక్తుడై తన వద్దనున్న కత్తితో దంపతులపై కత్తితో దాడి చేస్తుండగా అతని చేతికి గాయమై పరుగులు తీశాడు. వెంటనే పక్కనే ఉన్న భార్య రత్నాలమ్మను తప్పించుకునె ప్రయత్నంలో ఆమె చేతికి తీవ్రమైన గాయాలై కింద పడిపోయింది. గమనించిన గ్రామస్తులు హుటాహుటిన 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అవార్డు స్వీకరిస్తున్న మళ్ల వాణిశ్రీ

ఇన్నోవేషన్ ద్వారా విద్యకు సాధికారత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇన్నోవేషన్ ద్వారానే విద్యకు సాధికారత వస్తుందని మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్డులోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీ పేర్కొన్నారు. విశాఖ నగరంలోని మర్రిపాలెం ఫెయిర్ ఫీల్డ్ మారియట్ హోటల్‌లో ఆర్డర్కాం మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన ఫ్యూచర్ ఫార్వర్డ్ ఎడ్యుకేషన్ వర్క్‌షాప్ అండ్ న్యూ నార్మల్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్ అవార్డుల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎడ్ టెక్ తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తే విద్యార్థుల లెర్నింగ్ సులువవుతుందన్నారు. పర్సనలైజ్డ్ లెర్నింగ్ అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆమె పలువురు అధ్యాపకులు, విద్యారంగ నిపుణులతో చర్చించారు. విద్యార్థుల అభ్యాస అనుభవాలను, ఏకాగ్రతను, పఠనాశక్తిని సమీకరించేందుకు ఇవి బాగా ఉపయోగ పడతాయన్నారు.

రాణీ చంద్రమదేవి ఆసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెదవాల్తేరు పరిధిలోని రాణీ చంద్రమదేవి ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, ల్యాబ్, వార్డులను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై అధికారులను ఆరా తీశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో కాసేపు మాట్లాడారు. వైద్యాధికారులు, సిబ్బంది వ్యవహార శైలి, వైద్య సహాయం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రాణాలను అడ్డుపెట్టి అయినా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుంటామని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు అన్నారు. ఎఐఎస్‌ఎఫ్ 32వ జిల్లా మహాసభల సందర్భంగా శనివారం విద్యార్థులతో భారీ ప్రదర్శన, అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభ జరిగాయి. సభలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ శక్తులకు అమ్ముతోందని, దీనిని అందరూ వ్యతిరేకించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీను, యు.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చిట్టింపాడు పంచాయతీ మారుమూల లింగాపురం, గోపవరం గ్రామాల్లో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు ఆధ్వర్యంలో శనివారం ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకునే వారికి ప్రమాదంలో మరణిస్తే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10,000, బీమా కింద రూ.50వేలు లబ్ధిపొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయుకలు పాడి వెంకటేశ్వర్లు, కూడా సత్తిబాబు, పాంగి లక్ష్మణారావు, గెమ్మెలి నర్సింగరావు, కూడా బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 21 వరకు బాలల హక్కులపై అవగాహనా శిబిరాలను బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అందుకు సంభందించిన పోస్టర్‌ను శనివారం ఎంవిపి.కాలనీలోగల ఎస్‌వివిపి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదేశ్వరరావు, ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఆవిష్కరించారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

సమయపాలన పాటించని, గైర్హాజరు అధికారులపై చర్యలకు మండల సభలో సభ్యుల డిమాండ్

మండల సభలో అధికారులను ప్రశ్నిస్తున్న సిపిఎం సర్పంచ్ సునీత

ప్రజాశక్తి -దుంబ్రిగుడ:మండల సర్వసభ్య సమావేశానికి సమయపాలన పాటించని అధికారులపై, గైర్హాజరైన అధికారులపై స్థానిక మండల ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ బి ఈశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు హాజరు కావలసి ఉండగా కొన్ని శాఖ అధికారులు ఆలస్యంగా 12 గంటల తర్వాత హాజరయ్యారు. అది కూడా మండల స్థాయి అధికారులు హాజరు కాకుండా అసిస్టెంట్లను సమావేశానికి పంపించడంతో సభ్యులు తప్పు పట్టారు. ప్రతి సమావేశానికి నిత్యం ఇలాగే జరుగుతుందని ఇప్పటికైనా మార్చుకోవాలని ఎంపీపీ, జడ్పిటిసి తోపాటు వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు మూకు మ్మడిగా అధికారుల తీరుపై మండిపడ్డారు. సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటారా లేదా! స్పష్టమైన సమాధానం చెప్పాలంటూ ఎంపీడీవోను పట్టుబట్టి నిలదీశారు దీంతో స్పందించిన ఎంపీడీవో ఎవరైతే గైర్హాజరయ్యారో వారిపై చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని హామీని ఇవ్వడంతో సభ్యులు సమావేశాన్ని కొనసాగించారు. మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా విధులు చేపడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కంద్రుమ్ , గసభ , కితలంగి పంచాయతీ సర్పంచ్ లు హరి, సునీత సుబ్బారావు సభ దృష్టికి తీసుకెళ్లారు. జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ పంచాయతీ సర్పంచ్ పి కొములు తోపాటు పలువురు సభ్యులు తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో బోధన శాలలు ఏర్పాటు చేయాలని అధికారులను నిలదీశారు. నాడు నేడు ద్వారా పంచాయతీ పరిధిలో నిలిచిపోయిన పాఠశాల భవనాలను, అంగన్వాడి భవనాలను పూర్తి చేయాలని గసభ పంచాయతీ సిపిఎం సర్పంచ్ సునీత కోరారు. అభివృద్ధి పనులకు ప్రోటోకాల్ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని నిలదీశారు. ప్రతి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండే విధంగా చూడాలని సభ్యులు కోరారు. జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైస్ ఎంపీపీలు, పి లలిత, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బిర్సాముండా జయంతికి కొత్త భల్లుగుడ గిరిజనులు

ఐటిడిఎ పిఒ అభిషేక్‌తో కలిసి హాజరు... ప్రధాని నరేంద్రమోడీతో భేటీ

బిర్సాముండా జయంతిలో పాల్గొన్న పిఒ, గిరిజనులు

ప్రజాశక్తి పాడేరు : బీహార్ రాష్ట్రం జమాయి జిల్లాలో శుక్రవారం జన జాతీయ గౌరవ దివస్ లో భాగంగా నిర్వహించిన గిరిజన యోధుడు, భగవాన్ బిర్సాముండా 150 జయంతి కార్యక్రమానికి, ఆంధ్ర ప్రదేశ్ నుండి అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ నేతృత్వంలో అరకు వ్యాలీ మండలం కొత్తభల్లు గూడ ఆదివాసీ గిరిజనులు పాల్గొనే అవకాశం లభించింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి తో ఈ గిరిజన బృందం భేటీ అయ్యారు. శనివారం జిల్లా కేంద్రం విలేకరులకు ఐటీడీఏ పీవో అభిషేక్ ఈ కార్యక్రమం గురించి సమాచారం ఇచ్చారు. గత జనవరి నెలలో కొత్తభల్లు పంచాయతీలో పి.యం జన్ మన్ కార్యక్రమానికి ముందు, తరువాత ఆదివాసీ గిరిజన గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, తాగునీటి పథకాలు, రహదారుల నిర్మాణాలు, విద్యుత్ సదుపాయాలు, గృహ నిర్మాణాలు, ఆధార్ కార్డులపై అడిగి తెలుసుకున్నారన్నారు. స్వాబి గంగ తో సుమారు అరగంట సేపు ప్రధాని ముచ్చటించారు. గిరిజన ప్రాంతంలో అమలు చేస్తున్న అభివద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రధాన మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరకు మ్యూజియం క్యూరేటర్ మురళి, మ్యూజియం సిబ్బంది గణపతి, విడివికె ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల ఉద్యోగాల జాతర

భారీ వేతనాలతో ప్రముఖ కంపెనీల్లో నియామకాలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రాంగణ నియామకాలలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థుల సత్తాను చాటుతున్నారు. పలువురు ఇంజనీరింగ్ విద్యార్థులకు భారీ వేతనంతో ఉద్యోగాలు లభించాయి. ప్రాంగణ నియామకాలు జరిపిన ప్రముఖ సంస్థ పేపాల్ గీతం విద్యార్థికి రూ.36 లక్షల వార్షిక వేతనం ప్రకటించగా, మరో ప్రముఖ సంస్థ జె.పి.మోర్గాన్ రూ.19 లక్షల వార్షిక వేతనాన్ని, డార్విన్ బాక్స్ రూ.16 లక్షల వార్షిక వేతనాన్ని ఇస్తూ నియామకాలు చేపట్టాయని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ ఎస్.వంశీకిరణ్ సోమయాజుల తెలిపారు. స్టేట్ స్ట్రీట్ కార్పోరేషన్, డెలాయిట్, మూసిగ్మా, బోష్, మైక్రాన్, తేజాస్ నెట్‌వర్క్స్, ప్రిన్సిపల్ గ్లోబల్ సర్వీసెస్, సింక్రోని, యాక్సెంచర్‌లు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో ఇప్పటివరకు 300 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీటిలో ఒక్క యాక్సెంచర్ కంపెనీలోనే 177 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారన్నారు. ప్రాంగణ నియామకాలలో గీతం విద్యార్థులు విజయం సాధించడానికి ప్రణాళికాయుతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా పరిశ్రమల నిపుణులతో ముఖాముఖి, అవగాహన కార్యక్రమాలు, నమూనా ఇంటర్వ్యూలు వంటివి మంచి ఫలితాలు అందిస్తున్నాయని తెలిపారు. రానున్న రోజులలో ప్రాంగణ నియామకాలకు ప్రముఖ కంపెనీలు తేదీలను ఖరారు చేసాయని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, జిసిజిసి విభాగం అధిపతి ప్రొఫెసర్ కెవి.ఉమాదేవి, డాక్టర్ రోజీనా మాథ్యూ, ఎ.వెంకటేష్ అభినందించారు.

అదే స్థలం.. అదే వివాదం..!

రైల్వే జోన్‌కు పునాదిరాయి పడేనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల ఏళ్ల నాటి ఆకాంక్ష. బిజెపి 2014 ఎన్నికల హామీ కూడా అదే. కానీ వాస్తవంలో ఇప్పటి వరకూ జోన్‌కు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ ఏడాది డిసెంబరు పునాదిరాయికి డెడ్‌లైన్ కాగా జోన్ కార్యాలయ శంకుస్థాపనకు స్థలాన్నే పెద్ద వివాదంగా చూపిస్తూ కూటమి నేతలు కుంటిసాకులతో నేడు నెట్టుకొస్తున్నారు. నిజం చెప్పాలంటే.. ముడసర్లోవ వద్ద రైల్వే జోన్‌కు 52 ఎకరాల స్థలం ఏనాటి నుంచో సిద్ధంగా ఉంది. ఆ స్థలం సరైంది కాదని 2024 ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలైన బిజెపి, టిడిపి అగ్రనేతలు వైసిపి ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. అంతకుముందు సంగతిని పరిశీలిస్తే.. 2022 నవంబర్ 15న గత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రైల్వే డిఆర్ఎం కార్యాలయానికి లేఖ రాస్తూ భూమి సిద్ధంగా ఉందని, జివిఎంసి చేపట్టే సర్వేలో పాల్గొనాలని కోరారు. ఈ క్రమంలో రైల్వే శాఖ తమకు క్లియర్‌గా బౌండరీ వేసి భూమిని అప్పగించాలని డిమాండ్ చేసింది. అయితే, ముడసర్లోవలోగల 52 ఎకరాలకు ఎలాంటి ప్రహరీని జివిఎంసి వేసి ఇవ్వకుండానే తాజాగా అదే స్థలంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ నవంబర్‌లో రైల్వేజోన్‌కు పునాదిరాయి వేస్తారంటూ తాజాగా ఈ పార్టీల నేతలు చెప్పడం చూస్తే కూటమి నేతల ద్వంద్వ వైఖరి వెల్లడవుతోంది.

ముడసర్లోవలోని స్థలం (ఫైల్ ఫొటో)

స్థల వివాదం ఒక సృష్టే ?

నగరంలోని ముడసర్లోవ రిజర్వాయర్‌కు సమీపంలో 52 ఎకరాల స్థలం రైల్వేకు ఉంది. ఇక్కడ దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయ భవనం నిర్మాణం చేసేందుకు రైల్వే అధికారులు కేంద్రానికి పంపిన డిపిఆర్‌లో వివరాలు పేర్కొన్న విషయం తెలిసిందే. విశాఖలో బిఆర్‌టిఎస్ కోసం రైల్వే నుంచి 26 ఎకరాలను జివిఎంసి తీసుకోగా అందుకు బదులుగా సర్వే నెంబరు 57 నుంచి 59 పి, 61 పి, 62 పి, 63, 64, 65ల్లో 52 ఎకరాలను ముడసర్లోవలో కేటాయించింది. 2018లో తొలిసారి రైల్వే అధికారులు ఈ స్థలంలో కంచె వేసేందుకు వెళ్లగా 20 ఎకరాల్లో నివాసం ఉంటున్న గిరిజనులు అడ్డుతగిలారు. మిగతా 30 ఎకరాల మేర భూమి క్లియర్‌గానే ఉన్నా జోన్ భవన నిర్మాణానికి రైల్వేకు కేంద్రం అనుమతులు మంజూరు చేయలేదు. 2014లోనే ఈ స్థలానికి సంబంధించి రైల్వే, జివిఎంసి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం బౌండరీ వేసి రైల్వేకు అప్పగించాల్సి ఉంది. 2024 ఎన్నికల్లో గెలిచి ఐదు నెలలు దాటుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, జివిఎంసి ఇంకా ఆ పని చేయలేదు.

ప్రధాని పునాదిరాయి సమాచారం లేదు : రైల్వే

నవంబర్‌లో ప్రధానమంత్రి మోడీ వచ్చి ముడసర్లోవలో శంకుస్థాపన చేస్తారన్న టిడిపి కూటమి ప్రచారంపై రైల్వే నుంచి స్పందన లేదు. తమకు స్థలమే ఇంతవరకూ బౌండరీ వేసి అప్పగించలేదంటూ రైల్వే అధికారులు పెదవి విరుస్తున్నారు. ఒక రైల్వే అధికారి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 'ఆ 52 ఎకరాల చుట్టూ బౌండరీ నిర్మాణం చేస్తేనే మాకు హేండోవర్ చేసినట్టు లెక్క' అని తెలిపారు. ఇదిలా ఉండగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎన్‌టిపిసిలో ఈ నెల 29న దేశ ప్రధాని గ్రీన్ ప్రాజెక్టు విస్తరణ పనుల ప్రారంభానికి విచ్చేయనున్నారన్న సమాచారం నేపథ్యంలో సిఎం చంద్రబాబు రైల్వేజోన్ కార్యాలయ శంకుస్థాపనకు పిలిచే అవకాశం లేకపోలేదన్న చర్చ ప్రస్తుతం విశాఖలో సాగుతోంది.

జీవన శైలిలో మార్పులే కిడ్నీ వ్యాధులకు కారణం

అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న డిసిపి అజిత తదితరులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజల జీవన శైలిలో మార్పులే కిడ్నీ సంబంధిత వ్యాధులకు కారణమని మెడికవర్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం డైరెక్టర్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కమల్ కిరణ్ అన్నారు. రోబొటిక్ సర్జరీలో అద్భుతమైన పురోగతి, దాని ప్రయోజనాలు, ఆరోగ్య సంరక్షణ ఎలా మారుస్తుందో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మెడికవర్, క్రుజ్ బ్రిడ్జ్, లైఫ్ ఇన్‌ఫ్రా బృందం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బైక్ ర్యాలీ శనివారం ఆరిలోవ హెల్త్ సిటీ మెడికవర్ ఆసుపత్రికి చేరుకుంది. దీనిలో భాగంగా ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జోన్ వన్ శాంతి భద్రతల డిసిపి డాక్టర్ అజిత మాట్లాడుతూ కిడ్నీ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మెడికవర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కమల్ కిరణ్ మాట్లాడుతూ మానవ శరీరంలో కిడ్నీల పాత్ర కీలకమన్నారు. రక్తాన్ని శుద్ధి చేసి అందులో నుంచి హానికరమైన మలినాలను తొలగించి, తిరిగి శుద్ధి చేసిన రక్తాన్ని కీలక పాత్రను పోషిస్తాయన్నారు. ప్రతి ఏడాది ఆరోగ్య పరీక్షలు నిర్వహించకోవడం వల్ల ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఛీఫ్ బిజినెస్ ఆఫీసర్ మహేష్ కిరణ్, లైఫ్ ఇన్‌ఫ్రా డైరెక్టర్ భరత్, పద్మజా, వినీత్, శ్రీహరి, రాజీవ్, హరీష్, భరత్ పాల్గొన్నారు.

రోడ్డు అంచుల్లో ఆక్రమణలు తొలగించాలి

- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ఆక్రమణలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు జిల్లా ప్రధాన కేంద్రంగా మారినప్పటి నుంచి రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రహదారి మార్జిన్లలో వ్యాపారులు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. శనివారం ఉదయం ఎస్పి అమిత్ బర్దర్ తో కలసి పాత బస్ స్టాండ్ నుండి ఆర్టిసి బస్ స్టాండ్ వరకు గల రహదారిని పరిశీలించిన కలెక్టర్ ఆర్ అండ్ బి రహదారి నుండి జాతీయ రహదారిగా మార్పు చెందిన నేపథ్యంలో రంపచోడవరం నుంచి బొడ్డవర కూడలి వరకు వంద మీటర్ల విస్తీర్ణం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతున్నందున తొలగించాలని ఆదేశించారు. వ్యాపారులందరికి ముందుగా అవగాహన కల్పించాలని, నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాలలో ఆక్రమించి కట్టుకున్నవారిపై ఆగ్రహం వ్యక్త పరిచారు. కొంతమంది కట్టుకోవడమే కాకుండా ముందుకు ఉన్న స్థలాలను ఇతరులకు అద్దెకు ఇవ్వడం పట్ల మరింతగా ఆగ్రహం వ్యక్త పరిచారు. ముందుగా రైతు బజార్ ను పరిశీలించిన కలెక్టర్ దానిని వెంటనే శుభ్రపరచాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో ఎస్పే అమిత్ బర్దర్, పోలీస్ ఇన్స్పెక్టర్ ఆర్ అండ్ బి ఇఇ బాల సుందర బాబు, డిపిఓ లవ రాజు, తహసిల్దార్ వి. త్రినధారావు నాయుడు, సర్పంచ్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

మన్యం ఉత్పత్తుల ధరలు పతనం

బస్తాల్లో పిక్కలు

ప్రజాశక్తి -హుకుంపేట:- మండలలోని శనివారం వారపు సంతలో సీజనల్ పంటలకు ధర లేక ఇబ్బందులు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జోట్ట (పిక్కలు) అల్లం ధరలు పతనం అయ్యాయి. జోట్ట (పిక్కలు) కేజీ రూ.130-140 శనివారం సంతల్లో ఉండగా గతవారం 150నుండి200 వరకు ఉండిందని రైతులు పేర్కొన్నారు. అల్లం కేజీ 35 చొప్పున గంప 650 వరకు కొనుగోలు చేశారు. సీజనల్ పంటలకే ధర లేకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టపోతున్నామని వారు పోయారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరారు.

రోడ్ల నిర్మాణంతో గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి - చింతపల్లి :- సిమెంటు రహదారుల నిర్మాణం తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జెడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్‌తో కలిసి శనివారం లోతుగెడ్డ జంక్షన్‌లో సిమెంటు రహదారి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోని గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఉల్లి లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపిపి బూసరి కృష్ణారావు, గ్రామ పెద్దలు రామకృష్ణ, రమణ, రాజు పాల్గొన్నారు.

లోతుగెడ్డ జంక్షన్‌లో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి

ఉచిత డిఎస్‌సి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోటీ పరీక్షల్లో విజయం సాధించే దిశగా సన్నద్ధత ఉండాలని, ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యలో విరమించకూడదని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ డిఎస్‌సి అభ్యర్థులను ఉద్దేశించి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బిసి, ఇబిసి తరగతులకు చెందిన అభ్యర్థులకు ఎంవిపి.కాలనీలోని బిసి స్టడీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత డిఎస్‌సి శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడి చదివితే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైఫండ్, డిఎస్‌సి మెటీరియల్ కోసం రూ.1000 అందజేస్తామని వివరించారు. నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా ప్రిపరేషన్ కొనసాగించాలని, వర్తమాన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారిణి శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామారావు పాల్గొన్నారు.

సిఐటియు పోరాటంతో.. పూర్ణామార్కెట్ చిరు వ్యాపారులకు లబ్ధి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో గుర్తింపు పొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పూర్ణా మార్కెట్‌లో చిరు వ్యాపారులకు సిఐటియు పోరాటం కారణంగా గత ఆశీలు కాంట్రాక్టర్ దోపిడీకి చెక్ పడింది. కొత్తగా ఆశీలు కాంట్రాక్టు పాడుకొన్న వ్యక్తి చిరు వ్యాపారుల వద్ద నుంచి, అలాగే మార్కెట్లో ఇతర వ్యాపారుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం ఆశీలు వసూలు చేస్తుండడం పట్ల చిరు వ్యాపారులు హర్షం వెలిబుచ్చుతున్నారు. తమ పక్షాన పోరాడిన సిఐటియు చిరువర్తకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావుకు వారంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ పూర్ణా మార్కెట్‌లో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారాలు చేసుకునే వారి వద్ద నుంచి, అలాగే మార్కెట్‌లో ఇతర వ్యాపారుల వద్ద నుంచి గతంలో ఉన్న కాంట్రాక్టర్ ఆశీలు పేరుతో అధికంగా వసూలు చేసేవాడని చెప్పారు. ఆ సమయంలో తమ సంఘం చిరు వ్యాపారుల పక్షాన ఉండి జివిఎంసి కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కొత్త కాంట్రాక్టర్ రావడంతో సమస్య పరిష్కారం అయిందన్నారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ:గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక ప్రభుత్వం కళాశాల విద్యార్థులు బాలికల పాఠశాల విద్యార్థినిలు సుమారు 40 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎస్.సునీత మాట్లాడుతూ, పుస్తకాలు చదవడంతో విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. హైస్కూల్ ఉత్తీర్ణత అయిన తర్వాత ఆ పైన ఇంటర్మీడియట్ తో పాటు ఉన్నత చదువులు చదవడానికి కావలసిన పుస్తకాలు ఉన్నాయని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదివి మంచి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఓఎస్ సుబ్బారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా గళం వినిపించని నేతలకు పదవులెందుకు ?

ప్రజాశక్తి - చింతపల్లి :- చట్ట సభలలో ప్రనజా గళం వినిపించని ప్రజాప్రతినిధులు పదవులకు రాజీనామా చేయాలని టిడిపి మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, మన్య ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటే చట్టసభలలో ప్రజా సమస్యలను లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేయవలసిన ఉందన్నారు. అందుకు భిన్నంగా చట్టసభలకు వెళ్లకుండా ప్రజాక్షేత్రంలోనే పోరాడుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పొత్తూరు రామ్మూర్తి, వార్డు సభ్యుడు సత్తిబాబు, బంగారయ్య, జగన్నాథము భీమరాజు, కష్ణమూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 19, 20, 21 తేదీలలో నిర్వహించబడుతున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను తెలుగు భాషా కోవిదులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బేతవోలు రామబ్రహ్మం శనివారం తన గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు బాలోత్సవ కార్యక్రమ వివరాలను రామబ్రహ్మంకు వివరించారు. బాలోత్సవం సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్‌లో జరుగుతుందని తెలిపారు. 19న జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని రామబ్రహ్మాన్ని కోరారు.